క్లుప్తంగా

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి

కంబదూరు: మండల కేంద్రానికి చెందిన 54 టీడీపీ కుటుంబాలు సోమవారం సర్పంచ్ సాకే గంగాధర్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. టీడీపీ నాయకులకు మంత్రి ఉషశ్రీచరణ్ కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఆటో కార్మికుల ఉదారత

కళ్యాణదుర్గం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కర్నూలులో చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ వాల్మీకి గోపాల్‌కు తోటి కార్మికులు ఆర్థిక సాయం అందించి ఉదారత చాటుకున్నారు. సోమవారం వాల్మీకి సర్కిల్ ఆటో స్టాండ్‌లోఉన్న డ్రైవర్లు తమవంతుగా రూ.10 వేలు పోగు చేసి కుటుంబ సభ్యులకు అందజేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

నేతాజీకి నివాళి

రాయదుర్గంటౌన్/శెట్టూరు: రాయదుర్గం పట్టణంలోని లైబ్రేరిలో నేతాజీ సుభాష్ చంద్ర బోస్ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. అలాగే శెట్టూరు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్ర బోస్ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాల వేసి నివాళులర్పించారు.

'విశాఖ ఉక్కు' ప్రైవేటీకరణ ఆపాలి

కళ్యాణదుర్గం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట సోమవారం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయడాన్ని కేంద్రం విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ రిలే దీక్షలు చేపట్టారు. అనంతరం ఆర్డీఓ నిశాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. రిలే దీక్షలో కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల తాలూకా కార్యదర్శులు గోపాల్, నాగార్జున పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ఉరవకొండ: స్థానిక లయన్స్ క్లబ్ కార్యాలయంలో అనంతపురం కిమ్స్ సవీరా ఆస్పత్రి వైద్యులు సోమవారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. లయన్స్ చైర్మన్ సప్తగిరి మల్లికార్జున, రీజనల్ చైర్మన్ కొమ్మసాని బాలచంద్ర, సభ్యులు చందాకేశన్న ఆధ్వర్యంలో కార్డియాలజీ, ఆర్థో, జనరల్ మెడిసిన్, స్త్రీ సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దాదాపు 500 మందికి వైద్య పరీక్షలు చేపట్టారు.

ఆటో బోల్తా .. ఇద్దరికి గాయాలు

కూడేరు: మండలంలోని జల్లిపల్లి వద్ద సోమవారం ఆటో బోల్తా పడడంతో అనంతపురం ముత్యాలమ్మ కాలనీకి చెందిన సుబ్బక్క, గంగన్న తీవ్రంగా గాయపడ్డారు. కొర్రకోడు డ్యాం(పీఏబీఆర్ డ్యాం) రోడ్డుకు ఉన్న చింత చెట్ల నుంచి చింతకాయలు కోత కోసి వాటిని విక్రయించి సొమ్ము చేసుకునేందుకు సుబ్బక్క, గంగన్నతో పాటు మరో ముగ్గురు ఆటోలో బయలు దేరారు. ఘటనా స్థలికి రాగానే ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. క్షతగాత్రులను 108లో ఈఎంటీ సుధాకర్, పైలట్ సాగర్ అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

శెట్టూరు: కర్ణాటక ప్రాంతం తిప్పారెడ్డిపల్లి నుంచి శెట్టూరు మండలం అడవిగొల్లపల్లి, కనుకూరు గ్రామాలకు మద్యం తరలిస్తున్న హనుమంతరెడ్డి, చౌడప్ప, వరలక్ష్మిని అరెస్టు చేశామని ఎస్ఐ యువరాజ్ సోమవారం తెలిపారు. వారి నుంచి 360 మద్యం ప్యాకెట్లు, ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

మండల కమిటీ ఎన్నిక

శెట్టూరు: ఎమ్మార్పీఎస్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కన్వీనర్ హరిగోపాల్ సోమవారం తెలిపారు. మండల అధ్యక్షుడిగా వి.తిప్పేస్వామి, గౌరవాధ్యక్షుడిగా మారెన్న, ఉపాధ్యక్షులుగా మహేష్, పాలాక్షి, గౌరవ సలహాదారుడిగా తిమ్మప్ప, అధికార ప్రతినిధిగా బాబు, ప్రధాన కార్యదర్శిగా సురేష్, కార్యదర్శిగా సురేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చిరంజీవి ఎన్నికయ్యారు. దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు వారు తెలిపారు.

ఇంటింటా సంక్షేమ వెలుగులు

- మంత్రి ఉషశ్రీచరణ్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి
- 'గడప గడప'లో అపూర్వ స్పందన



కంబదూరు: లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్



బెళుగుప్ప: సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

కంబదూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటింటా సంక్షేమ వెలుగులు నిండాయని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సచివాలయం-2 పరిధి ఆర్డీటీ కాలనీ, పాత ఎస్సీ కాలనీల్లో మంత్రి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆమె ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు.అలాగే స్థానిక సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. మంత్రి మాట్లాడుతూ సీఎం జగనన్న ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం అన్ని వర్గాల ప్రజలకూ పథకాలను అందించి సంక్షేమ సారథిగా నిలిచారన్నారు.గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు పొందాలంటే జన్మభూమి కమిటీలు ఒప్పుకుంటేనే వచ్చేవని.. ప్రస్తుతం జగనన్న పాలనలో లబ్ధిదారులనే పథకాలు వెతుక్కుంటూ వస్తున్నాయని వివరించారు. ఇలాంటి సుపరిపాలన దీర్ఘకాలంగా కొనసాగాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు గుద్దెళ్ల నాగరాజు, బీసీ, రైతు విభాగాల జిల్లా ప్రధాన కార్యదర్శులు గోవింద్, నీలి శంకరప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలరాజు, వైస్ ఎంపీపీ భీమేష్, సర్పంచ్ సాకే గంగాధర్, నాయకులు కదిరిదేవరపల్లి హనుమంతరాయుడు, లింగమూర్తి, మీసేవ కుమార్, మల్లేష్, విల్సన్, రామస్వామి, రాజు, లోకేష్, కిరణ్, క్రాంతి, తహసీల్దార్ నయాజ్ అహ్మద్, ఎంపీడీఓ ఆంజనేయులు పాల్గొన్నారు.

జగనన్నకు వస్తున్న ప్రజాదరణను ఓర్వలేకనే అసత్య ఆరోపణలు

బెళుగుప్ప: నవరత్నాల పథకాలతో రాష్ట్రంలో ఆదర్శ పాలన కొనసాగుతుండటంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణను టీడీపీ ఓర్వలేక అసత్య ఆరోపణలు చేస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మండిపడ్డారు. సోమవారం బెళుగుప్ప సచివాలయం-1 పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అధికారులు, ప్రజా ప్రతినిదులతో కలసి వారు నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో జెడ్పీచైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ అందించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీకి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక పోతున్నారన్నారు. టీడీపీ చేపట్టిన ఇదేం కర్మ కార్యక్రమాన్ని ప్రజలు మాకేం కర్మ అని భావిస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో మారుమూల గ్రామాల్లో సైతం కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. ఒక్క బెళుగుప్ప గ్రామ సచివాలయం-1, 2 పరిధిలోనే రూ.24.64 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, సీఐ శేఖర్, ఎంపీపీ పెద్దన్న, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, బెళుగుప్ప సహకార సంఘ అధ్యక్షుడు శివలింగప్ప, సచివాలయ కన్వీనర్లు కరుణాకర్, పూల ప్రసాద్, ఉప సర్పంచ్ పాతన్న, ఎంపీటీసీలు శకుంతలాబాయి, ఈశ్వర్, మార్కెట్ యార్డు మాజీ ఉపాధ్యక్షుడు పాటిల్ నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ రామేశ్వరరెడ్డి, నాయకులు లేకిరెడ్డి రవీంద్రారెడ్డి, బాబురెడ్డి, చంద్రానాయక్, తిమ్మారెడ్డి, తిమ్మన్న, సుంకానాయక్, తిప్పేస్వామినాయక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందజేస్తున్నారు. పథకాల కోసం ప్రభుత్వ కార్యాలయాల వద్దకు వెళ్లి వ్యయ ప్రయాసలు పడాల్సిన పనిలేదు. మా కుటుంబానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.5,53,124 లబ్ధి చేకూరింది. ప్రభుత్వానికి అండగా ఉంటాం.

– బోయ నరసమ్మ, బెళుగుప్ప

ఆదాయ వనరులను సమకూర్చుకుందాం



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశులు

కళ్యాణదుర్గం: మున్సిపాలిటీకి ఆదాయ వనరులను సమకూర్చుకుందామని కమిషనర్ వెంకటేశులు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం చైర్మన్ తలారి రాజ్‌కుమార్ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు సంబంధించి కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులపై ఆయా కాలనీలలో రూ.5 లక్షల్లోపు విలువ ఉన్న పనులను చేయడానికి ఏకగ్రీవంగా ఆమోదించారు. గాంధీచౌక్ వద్ద మున్సిపల్ స్థలంలో గుడ్‌విల్ పద్ధతిపై గదులను నిర్మించడానికి రూ.24 లక్షల వ్యయంతో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు కమిషనర్ తెలిపారు. సర్వే నంబర్ 470లో 21 సెంట్లు స్వర్ణ రత్న ఆర్ట్స్ అసోసియేషన్, 5 సెంట్లు శ్రీ సాయి వికలాంగుల సంక్షేమ భవనం, 15 సెంట్లు చక్రధారి శీలివాంగన సంఘం, 12 సెంట్లు ఆర్య కటిక ఛత్రపతి శివాజీ భవనం, 11 సెంట్లు నాయీ బ్రాహ్మణ ధన్వంతరి భవన నిర్మాణానికి కేటాయిస్తూ ఆమోదం తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ఆదాయ వనరులైన వారపు సంత, బస్టాండ్, లారీ స్టాండ్, రోడ్డు మార్జిన్‌కు సంబంధించి 2023-24 ఏడాదికి సంబంధించిన వేలం నోటిఫికేషకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జయంఫణి, డీఈ సురేష్, టీపీఎస్ అలివేలమ్మ, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలకు విద్యుత్ పునరుద్ధరణ



జేసీ కేతన్‌గార్గ్‌కు సమస్యను వివరిస్తున్న మేజర్ పంచాయతీ పాలకవర్గ సభ్యులు

ఉరవకొండ: స్థానిక పంచాయతీ పరిధిలో వీధిదీపాలకు విద్యుత్ సరఫరా పునరద్ధరణ సమస్య పరిష్కారమైంది. సోమవారం మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్ లలితమ్మ, ఉపసర్పంచ్ వన్నప్ప ఆధ్వర్యంలో వార్డు సభ్యులు అనంతరంలో జరిగే గ్రీవెన్స్ సెల్ జేసీ కేతన్‌గార్గ్‌ను కలిసి వినతి పత్రం అందించారు. సర్పంచ్, ఉపసర్పంచ్ మాట్లాడుతూ తమ పాలకవర్గం ఏర్పడినప్పటి నుంచి రూ.2కోట్ల కు పైగా విద్యుత్ బకాయిలు చెల్లించామన్నారు. మిగతా పెండింగ్ బిల్లులు 15వ ఆర్థిక సంఘం నిధులు రాగానే చెల్లిస్తామన్నారు. వెంటనే స్పందించిన జేసీ విద్యుత్ శాఖ ఎస్ఈకి ఆదేశాలు ఇస్తూ విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు పళికేరిమల్లి, చేజాల ప్రభాకర్, శర్మాస్, పద్మావతి, భానుబేగం, వాసు, నిరంజన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత దూషణలు మంచివి కావు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం: మున్సిపల్ అధికారులు, వైస్ చైర్మన్ జయం ఫణిపై వ్యక్తిగత దూషణలు చేయడం మంచిది కాదని వైఎస్సార్‌సీపీ నాయకులు హితవు పలికారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మండల మాజీ కన్వీనర్ తిరుమల వెంకటేశులు, కౌన్సిలర్లు అర్చన, పరమేశ్వరప్ప, అబ్రహాం, కో ఆప్షన్ సభ్యులు అఫ్జల్, సల్లా మారుతి, వక్ఫ్ బోర్డు సభ్యుడు షేక్షావలి విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్ అనుమతి లేకనే ఇంటిని నిర్మిస్తున్నారన్న కారణంతో మున్సిపల్ అధికారులు ఒంటిమిద్దికి చెందిన ఎర్రిస్వామికి నోటీసులిచ్చారన్నారు. ఈ నెపంతో మున్సిపల్ కమిషనర్, టీపీఎస్, మున్సిపల్ వైస్ చైర్మన్‌ను వ్యక్తిగత దూషణతో దుర్భాషలాడటం సిగ్గుచేటన్నారు. . భవిష్యత్తులో ఎవరైనా దురుసుగా మాట్లాడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. నాయకులు బాలా సోము, సుధాకర్‌రెడ్డి, బసిరెడ్డి, వెంకటేష్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు హేమ, రూప పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఈ-క్రాప్ బుకింగ్ వేగవంతం చేయండి

వజ్రకరూరు: ఈ-క్రాప్ బుకింగ్ వేగవంతం చేయాలని ఏడీఏ పద్మజ ఆదేశించారు. సోమవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని ఏడీఏ కస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పీఎం కిసాన్ ఈ-కేవైసీ త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు.ఈ-క్రాప్ బుకింగ్‌ను వేగవంతం చేయాలన్నారు.రైతుభరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. ఏఓ శ్రీనివాస్, ఏఈఓ జానమ్మ, ఎంపీఈఓలు, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

మిరప పంట అపహరణ

బొమ్మనహాళ్: మండలంలోని సిద్దరాంపురం గ్రామానికి చెందిన కౌలు రైతు హెచ్. రవికి చెందిన మిరప పంటలో మిరపకాయలను గుర్తు తెలియని దుండగులు అపహరించారు. దాదాపు రూ. లక్షకు పైగా నష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు. బళ్లారి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపాడు.

దళిత సమస్యల పరిష్కారానికి కృషి

కళ్యాణదుర్గం రూరల్: దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. సోమవారం స్థానిక ఆర్అండ్‌బీ అతి థిగృహంలో సమావేశం నిర్వహించారు. జిల్లా నాయకుడు గూబనపల్లి నాగరాజు హాజరై మాట్లాడారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. నాయకులు ధను, రాజు, సుధాకర్, వన్నూర్‌స్వామి, రామకృష్ణ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ స్వచ్ఛ నీరు

వజ్రకరూరు: ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రజా ప్ర తినిధులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సర్పంచు మోనాలిసా అధ్యక్షతన జల జీవన్ మిషన్ పథకం పనులకు భూమిపూజ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ పథకంలో భాగాంగా ప్రతి ఇంటికీ కొళాయిలను ఏర్పాటు చేస్తామన్నారు. మంచిచేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ రమావత్‌దేవి, వైస్ ఎంపీపీ సుశీలా రాణి, ఎంపీటీసీ ఫిరోజ్‌బాను, ఉపాధ్యక్షుడు ఉస్మాన్, మండల కార్యదర్శి నల్లబోతుల రాజు, మైనార్టీ విభాగం కార్యదర్శి మున్నా, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పుట్‌బాల్ పోటీలకు ఎంపిక

ఉరవకొండ: జాతీయ స్థాయి పుట్‌బాల్ పోటీలకు మండలంలోని ఆమిద్యాల ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఆరునాక్షి ఎంపికైయింది. పీడీ మారుతీప్రసాద్ మాట్లాడుతూ తాడేపల్లి గూడెంలో ఈనెల 20 నుంచి 22 వరకూ నిర్వహించిన అండర్-14 బాల, బాలికల రాష్ట్ర స్థాయి పుట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు తరపున గోల్ కీపర్‌గా ఆరునాక్షి ప్రతిభ చూపిందన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

కణేకల్లు: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని రాయదుర్గం ఎంవీఐ విశ్వనాథ్‌రెడ్డి సూచించారు. కణేకల్లులో సోమవారం జాతీయ రహదారి భద్రత వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆటో డ్రైవర్లతో కలసి పోలీసులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రఘునాథరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై సమీక్ష

కణేకల్లు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉపాధి పనుల సామాజిక తనిఖీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ ఏప్రిల్ 2021, ఏప్రిల్ నుంచి 2022 మార్చి వరకూ ఉపాధి పథకం కింద రూ.13 కోట్ల విలువ చేసే 936 పనులు చేపట్టామన్నారు. ఈ పనులపై డీఆర్పీలు క్షేత్రస్థాయిలో వెళ్లి పారదర్శకంగా తనిఖీ చేపట్టి గ్రామసభలు నిర్వహించాలన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి

గుమ్మఘట్ట: రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు సరిపడా రసాయనిక ఎరువులు అందుబాటులో ఉంచాలని ఏఓ నిర్మల్‌కుమార్ సూచించారు. మండలంలోని రంగసముద్రం, తాళ్లకెర గ్రామాలలో ఆర్బీకేలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు.

పేదల సంక్షేమమే ఆర్డీటీ లక్ష్యం

కంబదూరు: పేద ప్రజల సంక్షేమమే ఆర్డీటీ లక్ష్యమని ఆ సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్ అన్నారు. మండల కేంద్రంలో ఆర్డీటీ ఆధ్వర్యంలో జోగినీలకు నిర్మించిన 29 గృహాలను స్పెయిన్ బృందంతో కలిసి మంఛూఫెర్రర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆర్డీటీ ద్వారా వెనుకబడిన వర్గాల ప్రజలకు ఉచితంగా విద్య, వైద్యం, ఉండడానికి పక్కా గృహాలను నిర్మించి ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ మహిళా సాధికారిక డైరెక్టర్ విశాలా ఫెర్రర్, ఆర్డీ లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యుడు గుద్దెళ్ల నాగరాజు, సర్పంచ్ సాకే గంగాధర్, ఏటీఎల్ జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

28న రథోత్సవం

గుమ్మఘట్ట: మండలంలోని పూలకుంట, రంగసముద్రం గ్రామాల్లో ఈ నెల 28న ఆంజనేయస్వామి రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆయా గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. ఏటా రథసప్తమి రోజు రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. పూలకుంట గ్రామంలో 29 వతేదీ స్వామిని ముత్యాలపల్లకిలో ఊరేగించనున్నట్లు వారు తెలిపారు.

'కల్యాణ మంటపం నిర్మించాలి'

బెళుగుప్ప: మండల కేంద్రంలో వాల్మీకి కల్యాణ మంటపానికి స్థలాన్ని కేటాయించి, భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు నేతృత్వంలో మండల వాల్మీకి నాయకులు సోమవారం జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డికి బెళుగుప్పలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘ నాయకులు పురుషోత్తంరాజు, మచ్చన్న, రమనేపల్లి రమేష్, పాతన్న, పూల ప్రసాద్, నరిగన్న, అంగడి ఎర్రిస్వామి పాల్గొన్నారు.

జంతు సంక్షేమ పక్షోత్సవాలు

కళ్యాణదుర్గం: మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లులో సోమవారం ఉరవకొండ డివిజన్ పశు సంవర్థక శాఖ ఏడీ డాక్టర్ శ్రీనివాస గుప్తా ఆధ్వర్యంలో జంతు సంక్షేమ పక్షోత్సవ కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ ఉప సంచాలకుడు డాక్టర్ జి. వెంకటేష్, సహాయ సంచాలకుడు డాక్టర్ మంజునాథ్, గర్భ కోశ వ్యాధుల నిపుణుడు డాక్టర్ సుదాకర్‌ల ఆధ్వర్యంలో పశువులకు చికిత్సలు అందజేశారు. డాక్టర్ వినోద్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

28న రథసప్తమి వేడుకలు

ఉరవకొండ రూరల్: మండలంలోని బూదగవి గ్రామంలో దక్షణాభిముఖంగా వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సూర్యనారాయణ స్వామి ఆలయంలో జనవరి 27 నుంచి రథసప్తమి వేడుకలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు, సర్పంచ్ లక్ష్మీదేవి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 27న మహాగణపతిపూజ, గంగపూజ, గోపూజ, పుణ్యావహవాచనం, దేవనాంచిపూజ, పంచగవ్య ప్రాసన, సర్వతోభద్రమండల దేవతాఅవాహన నవగ్రహ ఆరాధన కలశ స్థాపన, మహామంగళ హారతి పూజలుంటాయన్నారు. 28న షోడశోపచార పూజ, ఈశ్వరుడికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, సూర్యునికి మహాసౌర పూర్వక అరుణ రుద్రాభిషేకం, మహామంగళహారతి తదితర పూజలు చేపడతామన్నారు. అనంతరం ఛాయాఉష సమేత సూర్యనారాయణస్వామి కల్యాణమహోత్సవం నిర్వహిస్తామన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

రాయదుర్గంటౌన్: స్థానిక పురపాలక సంఘంలోని కౌన్సిల్ హాల్‌లో 24వ తేదీ ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. సమావేశంలో పట్టణంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలతోపాటు ప్రజా సమస్యలపై చర్చిస్తామన్నారు. కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు, విభాగాల వారిగా అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

శెట్టూరు: మండలంలోని బసంపల్లిలో మంగళవారం ఉదయం ఆరు గంటలకు తిప్పనపల్లిలో మధ్యాహ్నం మూడు గంటలకు మంత్రి ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ లక్ష్మీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు మంజునాథ సోమవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు హాజరు కావాలన్నారు.

కూడేరు: మండలంలోని పి.నారాయణపురంలో మంగళవారం ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు సర్పంచ్ హనుమంతరెడ్డి, ఎంపీపీ నారాయణరెడ్డి సోమవారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు హాజరు కావాలని వారు కోరారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తాగునీటి ప్లాంట్



విద్యార్థులతో కలసి ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దాతలు సత్యనారాయణరెడ్డి, నాగిరెడ్డి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దాతల సహకారంతో రూ.1.20 లక్షల విలువైన తాగునీటి ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ పనిచేస్తున్న కణేకల్లు మండలం గనిగెర గ్రామానికి చెందిన దాత సత్యనారాయణరెడ్డి ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. కళాశాలలో సోమవారం ప్లాంట్‌ను తన పెద్ద నాన్న పాటిల్ నాగిరెడ్డి, విద్యార్థులతో కలిసి ప్లాంట్‌ను లాంఛనంగా ప్రారంభించారు. దాత మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థం ప్రభుత్వ కళాశాలలో చదివే పేద విద్యార్థులకు ఉపయోగపడేలా ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, అధ్యాపకులు శ్రీనివాసులు, గోవిందరెడ్డి, సుబ్రమణ్యంస్వామి తదితరులు పాల్గొన్నారు.

5జీ, 6జీతో ఉపాధి అవకాశాలు

కళ్యాణదుర్గం: 5జీ, 6జీ వల్ల ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా) తెలంగాణ స్టేట్ సెంటర్ డైరెక్టర్ బ్రహ్మారెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ జయరామిరెడ్డి అధ్యక్షతన ఫ్యూచర్ నెట్‌వర్క్ అనే అంశంపై నేషనల్ వెబ్‌నార్ నిర్వహించారు. వెబ్‌నార్‌లో కళాశాల కన్వీనర్ పి. సూర్య నాగిరెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ నిర్మలాదేవి, హైకాన్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ నరసింహమూర్తి మాట్లాడారు. దేశ ఆర్థిక అభివృద్ధి ఫ్యూచర్ నెట్‌వర్క్‌పై ఆధారపడి ఉందన్నారు. అనంతరం టెక్నాలజీపై పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్, కో కన్వీనర్ జీఎల్ఎస్ ప్రసాద్, సెక్రటరీ సుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినం

రాయదుర్గంటౌన్/కళ్యాణదుర్గం/బెళుగుప్ప: కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో సోమవారం అమ్మవారి ఆత్మార్పణ దినం ఆర్యవైశ్య సంఘం, ఆలయ కమిటీ సభ్యులు, భక్తుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బెళుగుప్పలో నిర్వహించిన పూజల్లో ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



రాయదుర్గంటౌన్: అమ్మవారి కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న ఆర్యవైశ్య మహిళలు



కళ్యాణదుర్గం: హోమం నిర్వహిస్తున్న వేద పండితులు



బెళుగుప్ప: పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి